# అనాథ

శ్రీ. డి. రాజేశ్వర్

మధ్యాన్నం 12 గంటల వేళయైనది. ప్రచండ భానుడు తనజ్వాలల ప్రభావముచే తీక్ష్ణముగ మింట ప్రకాశించుచున్నాడు. బాటసారులకు మీదనునెత్తి, క్రిందను కాళ్లు మండిపోవుచున్నవి. భూపరి సరమారుతముగూడ వేడెక్కి శరీరమంతయు స్వేదముచే తడుచున్నది. అట్టితరి నేను బజారునుండి యింటికి వచ్చుచున్నాను. మార్గమధ్యమున విచిత్ర దృశ్యమొకటి నాకంటబడుట తటస్థించెను. బక్కచిక్కిన దేహముతో, మలినమైన జీర్ణవస్త్రములు ధరించి, తుప్పవలెనున్న మాసిన కేశములతో, భిన్నమైనట్టి యొక మట్టిపాలిక చేతబట్టుకొని, ఒకయనాథ గోచరించినది. ఆమె ముఖమును చూచినప్పుడు, ఆమె బహు సంకటపడినట్లు చెప్పకయే చెప్పుచున్నది. ఆమె యొక ప్రాసాదముంగిట నిలువబడి, "అమ్మా! దిక్కులేనిదానిని. రెండురోజులనుంచి భోజనములేదు. పిడికెడు మెతుకులు పెట్టు తల్లీ;" యని పీలస్వరముతో అర్థించెనో లేదో తక్షణమే భవనాంతర్భాగమునుంచి "ఛీ! ముష్టిపీనుగా! ఈ కరువు రోజుల్లో మేమే బ్రతకలేక చస్తున్నాము. నీకేం? గుడ్డిదానివా, సొట్టదానివా? కూలో, నాలో చేసుకొని బ్రతకలేవూ? పాపిష్టి! ఎందుకే యింకా నిల్చున్నావు .. అని గర్జన ఉరుముచునే యున్నది. ఇక నేను ఆ మాటలు వినలేక నా దారిని నేననుసరించి ఇల్లు చేరుకున్నాను. ఏమేమో ఆలోచనలు నన్ను కలచివేయుచున్నవి. ఎందుకో నేను వీధిచావిడిలోనే నిల్చున్నాను. అల్లంత దూరములో ఈడువలేక ఈడువలేక తన దేహమును ఈడ్చుకొనుచు ఒక జీవచ్ఛవము పోవుచున్నది. కాదు...! కాదు.. !! మాయింటి వైపుకే వచ్చుచున్నది. దానిని పరిశీలించగా నదినాకు మార్గమధ్యమున కన్పించిన ముష్టిదే. మా గుమ్మముదగ్గరకామెవచ్చి, నీరసమైన గొంతుతో, "తండ్రీ! పిడికెడు మెతుకులు పెట్టించు." అని పలికినది. ఆమె విషాదపల్కులు నా హృదయమును కలచివైచినది. నాలో జాలి, దుఃఖములు ఒక్కమారే పొంగి పొరలినవి. నేను వెంటనే ఇంటి లోనికిబోయి యెవ్వరితోనూ ప్రసంగించక ఇంతయన్నము తీసుకొనివచ్చి యామెకు పెట్టితిని. ఆమె సంతోషవదనయై, మిక్కిలి యాత్రముతో దానిని భుజించి కడుపునిండునట్లు నీరు త్రాగినది.

"తండ్రీ! నాప్రాణము కాపాడిన దాతవునీవు. ఇంక నేను వెళ్లివచ్చెదను." అని పల్కినది. వెంటనే నామనస్సులో అనేక యాలోచనలు బయలుదేరినవి. చివరికి ఉండలేక "అమ్మా! నీకు ఇంత పిన్నవయస్సులోనే ఈ యాచనావృత్తి జీవనాధారమగుటకు కారణమేమి? నీకు తల్లిదండ్రులుగాని, అన్నదమ్ములుగాని, అక్కసెల్లెండ్రుగాని యెవ్వరూ లేరా?" అని ప్రశ్నించినాను. అప్పుడామె ఒక వేడి నిట్టూర్పువిడచి, "బాబూ! ఈ పాటి ప్రశ్న నన్ను ప్రపంచములో ఇప్పటికెవ్వరూ అడుగలేదు. నాకష్టసుఖములతో ఈ మానవజాతికి పనిలేదు. మీరు పోవుచున్న నాప్రాణమును కాపాడిన దాతలు. నాకథ చెప్పెదను, వినండి." అంటూ ఈ విధముగా చెప్పుట కారంభించినది.

"మేము యాదవకులమువారము. నాకు తల్లిదండ్రులు, ఒక అన్నయ్య ఉండేవారు. మాకు మూడు పాడిగేదెలు, ఒక చిన్నపూరియిల్లే ఆస్తిపాస్తులు. మా నాన్న ఆ గేదెలపాడివలననే ఏదో యొక విధముగా జీవనయాత్ర సాగించేవాడు. నాదురదృష్టవశాత్తు నేను జన్మించిన ఆరుసంవత్సరములకే మా నాన్న గతించినాడు. మా అమ్మ మమ్మల్ని చూసుకుంటూ, నాన్నపోయినాడన్న విచారమే క్రమంగా

మఱచిపోయింది. నేను, మా అన్న అమ్మతో హాయిగా, ఆటపాటలతో కాలము గడిపేము. నాకు 12 సం॥ల వయస్సు, మా అన్నకు 15 సం॥ల వయస్సు. ఇట్లా యుండగా మాయూరిలో కలరాయనే భయంకర పిశాచము ప్రజల నందఱను ఆవహించినది. ఆ కలరా పిశాచము మా అమ్మనుకూడ సోకినది. అమ్మ మంచముపైనే మలమూత్రములు చేయుచున్నది. ఎడతెఱపిలేని వమనములతో మా చిన్నగుడిసె అశుభ్రమై పోవుచున్నది. నేను, అన్నయ్య పిడికిలిలో ప్రాణములు బిగపెట్టుకొని యున్నాము. మా అన్నయ్య మిక్కిలి శ్రద్ధతో అమ్మయొక్క మలమూత్రములు, వమనములు, యెత్తి శుభ్రము చేసేవాడు." (దుఃఖ మాపలేక సజలనేత్రయైనది. నోటమాట రాలేదు.) నాలో విస్మయ విభ్రాంతులు కల్గినవి. "తరువాత యేమిజరిగినది? చెప్పమ్మా!" యని అడిగితిని.

"అమ్మ ఆఖరిమాటలు నాకు ఇప్పటికిని కొంచెము జ్ఞాపకమున్నాయి, 'అబ్బాయీ! చెల్లిని జాగ్రత్తగా చూసుకో. మరి యిక నేను ...' అని శాశ్వతముగా కండ్లుమూసినది. వెంటనే మేము అమ్మ కట్టెపైపడి దుఃఖపారావారములో మునిగిపోయేము. ఇంకను నాకడుపులో దుఃఖము చల్లారనే లేదు. మరి నాలుగు రోజులకు ఆ భయంకర కలరా పిశాచము మా అన్నయ్యనుకూడ కౌగలించుకొన్నది, ఈ నిర్భాగ్యురాలిని ఒంటరిగా విడిచిపెట్టేసి, అట్టి విపత్కాలములో నాకు భగవంతుడుకూడ తోడ్పడ లేదు. మా అన్నయ్యయొక్క ఉచ్ఛ్వాస, నిశ్వాసలు అనంతవాయువుల్లో ఐక్యమై పోయినవి. కష్టాలలో కష్టాలు కల్పించుట ఆ భగవంతుని విలాసమేమో! ఇట్టివారినిచూచి ఆనందించుతాడు!! ఇంకను అంతటితో నన్ను వదలిపెట్టలేదు. ఆ రాత్రియే, మంచి సమయము లభించినదని తలచి యెవరో మా గేదె నొక దానిని దొంగిలించినారు. తెల్లవారుఝామునచూడగా యేమియాశ్చర్యము! - మరియొక గేదె కాళ్లుజాచి చచ్చియున్నది. నలుగురూవచ్చి దానిని నాగుపాము కఱచినదని చెప్పిరి. మరియొక గేదె వట్టిపోయినది. ఆహా! సర్వేశ్వరునికృప నాపై నిట్లున్నది. నేనీప్రపంచములో నింక జీవించుట యెవరికొఱకు? కాని ఈ కష్టాలన్నీ పడునట్లు నానుదుటిపై బ్రహ్మ వ్రాసినప్పుడెట్లు తప్పును? ఇంక నాజీవితము నడిసముద్రములో కొట్టుకొనుచున్న చుక్కానిలేని నావయైనది. అప్పటినుంచి ఈ యనాథ యిట్లు వాడ వాడలంబడి భిక్షమెత్తుకొనుచున్నది. బాబూ! ఈ నాలుగేండ్లనుంచి నాకథ సావధానముగా విన్నవారేలేరు. మీకు నా కృతజ్ఞతా వందనములు." అని తన మట్టిపాలిక చేతబట్టుకొని మెల్లగా నడచిపోవుచున్న యనాథను నిర్ఘాంతపు దృక్కులతో చూచుచు యట్లేనిలబడిపోయితిని.

---


## బిల్వ, వేప

బిల్వ, వేప అను జాతీయమూలికలనుగూర్చి శాస్త్రవిషయక పరిశ్రమచేసి వ్రాయబడిన ఉత్తమ గ్రంధరాజములు. ఈ మూలికల ఓషధిగుణము, వైద్యప్రయోగములు, శాస్త్రచర్చ, పురాణ వివరము, సరళశైలిలో వివరింపబడినవి. వైద్యులకు, భక్తులకు మిక్కిలి ఉపయోగకరమైన గ్రంధములు. క్రౌనుసైజున మంచి ఫెదరువైటు కాగితములమీద ముద్రింపబడి గృహలక్ష్మి గ్రంధమాలలో ద్వితీయ తృతీయ కుసుమములుగా ప్రచురింపబడినవి.

గ్రంధకర్త : కే. యస్. కేసరి          ప్రతి 1-కి 0-12-0

గృహలక్ష్మి కార్యాలయము, రాయపేట :: మద్రాసు.